# కంచికి వెళ్ళొచ్చిన కథ

ఈ మధ్య బొత్తిగా తోచటంలేదనుకునే బుద్ధిమంతులు - కడుపులో చల్ల కదలని బాపతు - అక్కడక్కడా ఎల్లవేళలా ఉంటూనే ఉంటారుకద ! అటువంటివారు, మాటవరసకి, నూరుమంది ఉన్నారనుకుందాం. వారిలో ఎనభై మందికి అజీర్తి అనే అవలక్షణం వొకటి ఉండి తీరుతుంది. మిగతా ఇరవై మందికీ వేవిళ్ళుంటై. (ఆ ఇరవై మందీ విధిగా ఈడులోఉన్న ఆడవాళ్ళే అయి ఉంటారుగనక !)

తినేది అరగటానికి, ఏదో ఒకటి తోచి తీరాలి మరి !

ఇట్లా ఏమీ తోచక. అజీర్తి పెంచుకున్న వొక సుబ్రమణ్యం - కంచికి వెళ్ళొచ్చాడు.

"కంచికే ఎందుకుపోవాలి? కాశీకి ఎందుకుపోలా?" అన్నాను సుబ్రమణ్యాన్ని చూట్టానికి పోయినప్పుడు.

సుబ్రమణ్యం అందరి సుబ్రమణ్యాల్లాంటివాడు కాడు. ఈ సుబ్రమణ్యం కథలూ గట్రా రాసేబాపతు.

"ఈ వయసులో కాశీకి పోతే ఏం వొరుగుతుంది, మట్టి! కంచికిపోతే, నాలుక్కథలన్నా దొరుకుతై. మన్దాకా రాకుండా, అక్కడికి చాలా కథలు చేరుకున్నాయిలే. కొన్ని లాక్కొచ్చా - కష్టంమీదే అనుకో!" అన్నాడు సుబ్రమణ్యం.

"నువ్వేం చెపుతున్నదీ నాతలకెక్కటంలేదు" అన్నాను తల గోక్కుంటూ.

సుబ్రమణ్యం - సుబ్రమణ్యంలాంటి నవ్వు నవ్వాడు.

"ఎందు కెక్కుతుందీ ? కథలు చదవటం తప్ప వాటిసంగతి బొత్తిగా తెలీనివాడివాయె. చెపుతా విను. ముగింపులో మంచి మలుపొచ్చి, చక్కగా, రమ్యంగా ముగిసే ప్రతీ కథకీ - మొదటితరగతి రైలుపెట్టెలో బెర్తుల్లాంటివి - కంచిలో మంచి బెర్తులు దొరుకుతై. పరిపక్వానికి రాకుండా ఆగిపోయే కథలు - అర్ధాయుష్షు ప్రాణాలు దెయ్యాలైనట్టు, కిటకిటలాడే మూడోతరగతి రైలుపెట్టెలో జనం కుక్కుకున్నట్టుగా కంచిలో క్రిక్కిరిసి ఉంటున్నై. ముగియవలసినచోట ముగియక, ఇంకాఇంకా సాగదీసుకున్న కథలు - తొంభై యేళ్ళు దాటి నవనాడులూ కుంగిపోయినా, నసపెట్టి చంపుకుతినే ముసలిపీనుగుల్లాగా, పీక్కుతినేసే కథలుకూడా, అరుగులమీదా, కాలవల్లోనూ, గతుకుల్లోనూ, కాలక్షేపం చేస్తున్నై."

అజీర్తితోపాటు సుబ్రమణ్యానికి పిచ్చికూడాపట్టిన అవలక్షణాలు కనిపించినై. పిచ్చివాడితో కాస్త జాగ్రత్తగా మాట్లాడాలని, "ఇంతకీ ఏం తెచ్చా" వన్నాను.

"కామాక్షిని లాక్కొచ్చా !" అన్నాడు సుబ్రమణ్యం.

"ఏ కామాక్షి ?" సుబ్రమణ్యం మళ్ళీ సుబ్రమణ్యంలాంటి నవ్వు నవ్వాడు.

"కామాక్షి ఎక్కడికి పోయిందీ ఎవరికీ తెలీదంటూ ఒక కథ ముగించాను కానా ? అది అర్ధాయుష్షు కథ. ఎక్కడికీ పోలా ! కంచిలో ఎదురైంది - నే ననుకున్నట్టే ! దాన్ని లాక్కొచ్చా ! ఎలాఉంది మన ప్రజ్ఞ!" అన్నాడు సుబ్రమణ్యం సుబ్రమణ్యంలాంటి ముఖంపెట్టి.

కాస్సేపు పిచ్చివాడి ఎదట కాలక్షేపంచేస్తే మనకీ పిచ్చెత్తినట్టే ఉంటుంది. ఆ లక్షణాలు నాలోనూ కనిపించసాగినై. ఎందుకంటే, వోరగా తలుపు చేరవేసిఉన్న గదిలోంచి గాజులు గలగలమన్నాయి. సుబ్రమణ్యం ఎవతెనో లాక్కొచ్చి నాటకమాడుతున్నాడని రూఢి అయింది.

"లోన ఎవరో ఉన్నట్టున్నారు ?" అన్నాను వెర్రిముఖంపెట్టి.

"కామాక్షి !" అన్నాడు సుబ్రమణ్యం. నాకు ఈసారి నిజంగా మతిపోయింది. ఎందుకంటే, కొన్నాళ్ళకిందట సుబ్రమణ్యానికి, కామాక్షి కాదు గాని, మీనాక్షి అనే పిల్లతో పరిచయమవడం నే నెరుగుదును. ఆ పిల్ల కనపడడం మానేసినప్పట్నుంచే సుబ్రమణ్యానికి బొత్తిగా తోచడం మానేసి, అజీర్తిపట్టుకుంది.

"రా ! పరిచయం చేస్తా !" అంటూ లేచాడు సుబ్రమణ్యం.

ఇద్దరం గదిలో దూరాం. గదిలో ఎవరూ కనపడలేదు. ఏదో చప్పుడు. అది సుబ్రమణ్యంలాంటి నవ్వు ! బల్లపైన ఒక తెల్లకాగితంమీద పెద్ద అక్షరాలతో ఈ విధంగా రాసిఉంది —

"కంచినుంచి తిరిగొచ్చిన కామాక్షి కథ."

'శేఖర్'